మదనపల్లెలో విషాదం

- పాముకాటుకు గురై తండ్రి మృతి, కొడుకు పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండలంలో తండ్రి, కుమారుడు పాము కాటుకు గురయ్యారు. బుధవారం ఈ విషాదకర సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. చౌడేపల్లి మండలం బోయకొండ సమీపంలోని యానాదిపాళెంకు చెందిన నరసింహులు(56), సాలమ్మ దంపతులు మదనపల్లి మండలం మేడిపల్లి వద్ద ఉన్న నిస్సార్‌అహమ్మద్‌కు చెందిన మామిడి తోటలో 40 ఏళ్లుగా కాపలాగా ఉంటూ ఆ తోటలోనే నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. తండ్రి నరసింహులు, కుమారుడు రాజు మంగళవారం తోటకు ఆనుకుని ఉన్న వంకలోకి చేపల వేటకు వెళ్లారు. అక్కడ ఉన్న ఓ పాము తండ్రి కొడుకులను కాటేసింది. ఇద్దరు మేడిపల్లికి చెందిన ఓ వ్యక్తి వద్ద మంతరించుకున్నారు. బుధవారం ఉదయం తండ్రి, కొడుకులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఇద్దరిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించేలోపే నరసింహులు మృతి చెందాడు. అతని కుమారుడు రాజు పరిస్థితి విషమంగా మారింది. మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తాలూకా పోలీసులు విచారిస్తున్నారు.

కొత్త ఆశలతో..

కొత్త ఆశలతో నూతన వసంతం పలకరిస్తోంది. కోటి ఆశలతో కొత్త ఉషస్సులతో స్వాగతం పలుకుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వ వాగ్దానాల అమలుపై నిరాశాపూరిత వాతా వరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో జిల్లాలో ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితమైంది. జిల్లా పునర్విభజనను శాస్త్రీయంగా చేపడతామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. అన్నమయ్య జిల్లా అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. 2026 సంవత్సరం కొత్తఆశలు రేపుతోంది. రైతుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి కూటమి సర్కారు ముందుకు వస్తున్నప్పటికీ, ఉసురు తీసుకున్న రైతులకు, సోలార్ యాజమాన్యాల నుంచి పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగునీటి ప్రాజెక్టులకు సప్లయ్ చానళ్ల వరకు సమస్యలు వేధిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా గండికోట, మైలవరం, పైడిపాలెం నిర్వాసితులకు పరిహారం మొదలుకుని చిత్రావతి, బ్రహ్మసాగర్ ప్రాజెక్టుల లీకేజీలను అధిగమించలేని పరిస్థితి నెలకొంది. కొత్త ఏడాదిలో సంక్షేమ పథకాలు అమలు నేపథ్యంలో జిల్లా వాసుల ఆశలు, ఆకాంక్షలు అంచనాల్ని మించి ఉన్నాయని చెప్పవచ్చు.

- **సోలార్ యాజమాన్యాల ఇష్టారాజ్యం**
- **కాగితాల్లోనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు**
- **పునర్విభజనలో 'అన్నమయ్య' గల్లంతు**
- **అమలుకు నోచని సిఎం హామీలు**

కడప ఉక్కుకు శంకుస్థాపన చేస్తున్న చంద్రబాబునాయుడు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లా ప్రగతి నత్తనడకన సాగుతోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ప్రగతి పరుగు పెడుతుందని ప్రజానీకం ఆశలు పెంచుకుంది. కూటమి అడుగులను గమనిస్తే ఎన్‌డిపిఎస్ కోర్టు, ఎంఎస్ఎంఇ తరలింపు, అన్నమయ్య జిల్లా అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేయడం నిరు త్సాహాన్ని కలిగిస్తోంది. ఇటీవలి జిల్లా పర్యటనలో భాగంగా 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి కడపకు తాగునీటి సదుపాయాన్ని అందిస్తానని హామీ నిరీక్షిస్తోంది. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులు మొదలుకుని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ పోస్టుల భర్తీ, నియామకాలు పూర్తి చేయడం సాకారం కావడం లేదు. జిల్లాలో రాజోలి, జొలదరాశి, కుందూ లిఫ్టు, జిఎన్ఎస్ఎస్-2 నుంచి రాయచోటికి లిఫ్టు, వెలిగల్లు లిఫ్టు మొదలగు పనులు ప్రతిపాదనల దశను దాటడం లేదు. యోగి వేమన యూనివర్శిటీకి నిధుల కొరత, కొత్తకోర్సులు ఏర్పాటు, ఫ్యాకల్టీ నియామకాలు, నందలూరులో ఉద్యానవన యూనివర్శిటీ ఏర్పాటు, జిఎన్ఎస్ ఎస్‌ఫేజ్-2, ఒంటిమిట్ట కోదండ రామాలయ మాస్టర్‌ప్లాన్, ఐటి పార్క్ మొదలగు అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్రం సెయిల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండివైఖరిని అవలంభించడంతో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని శంకుస్థాపన చేసింది. మూడేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొంది. 2026 పదేళ్లు గడుస్తున్నప్పటికీ సాకారం కావడం లేదు. కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి లభించకపోవడంతో పారిశ్రామిక ప్రగతిలో వెనుకబడింది. ఫలితంగా యువత పొట్టచేతబట్టుకుని గల్ఫ్, పశ్చిమ దేశాలకు వలస వెళ్తోంది. దేశీయంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. వ్యవసాయ రంగాభివృద్ధిలో కీలకమైన గండికోట, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు, జిఎన్ఎస్ఎస్-2 పనుల మొదలుకుని, ఉమ్మడి జిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించే పరిస్థితి కనిపించ లేదు. ఫలితంగా రిజర్వాయర్లలో నీళ్లు నిలిపినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి, బ్రహ్మంసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 వంటి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. అన్నమయ్య, పింఛా, ఎగువ సగిలేరు వంటి ప్రాజెక్టుల మరమ్మతులు ఎప్పటికి సాకారమవు తాయో తెలియని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి, సోమశిల ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది చివరి నాటికైనా అన్నమయ్య పునరుద్ధరణ, కొప్పర్తి, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు పర్యావరణ అనుమతుల సమస్య పరిష్కారమై ప్రగతి పరుగులు తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కలగానే మిగిలిన సోలార్‌ప్లాంట్



నేటికీ మారని అన్నమయ్య డ్యామ్ దుస్థితి

జిల్లా అభివృద్ధికి బాటలు వేద్దాం

- **అధికారులతో కలెక్టర్ నిశాంత్ కుమార్**
- **ప్రారంభమైన నూతన కలెక్టర్ కార్యాలయం**

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ఆకాంక్షల మేరకు మదనపల్లె కేంద్రంగా ఏర్పాటైన నూతన అన్నమయ్య జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నూతన అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారికంగా కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభానికి ముందు కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముందుగా మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం నూతన జిల్లా కలెక్టరేట్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పలు సెక్షన్లను ఆయన పరిశీలించారు. అనంతరం పరిపాలనకు సంబంధించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. అన్నమయ్య జిల్లా అభివృద్ధికి బాటలు వేద్దామని కలెక్టర్ అధికారులకు సూచించారు.

పీలేరులో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ప్రారంభం

పీలేరు: నూతన ఆర్‌డిఒ కార్యాలయాన్ని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం లేక ముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా, పీలేరు, కలికిరి పట్టణాల్లో జరిగిన బహిరంగ సభ, మినీ మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మదనపల్లెను జిల్లా, పీలేరును రెవెన్యూ డివిజన్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. మదనపల్లె జిల్లాకు అన్నమయ్య జిల్లాగా పేరు పెట్టడం హర్షించదగ్గ విషయమని, అన్నమయ్య ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని కలియుగ శ్రీవేంకటేశ్వర స్వామి పరమ భక్తుడని చెప్పారు. తాము ఏ ప్రాంత ప్రజలకు వ్యతిరేకం కాదని, ప్రజల సౌలభ్యం, ప్రజల సహకార పోరాటంతో ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమం, భావితరాల భవిష్యత్తు కోసం వీటిని సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురుగయ్య, విఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు రత్నాకర్, రెవెన్యూ సిబ్బంది, పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామమూర్తి, బిసి నాయకుడు పోలిశెట్టి సురేంద్ర, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె నూతన కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు

ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, విద్యార్థులు - హాజరైన ఎమ్మెల్యేలు కిషోర్ కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిషోర్ కుమార్‌రెడ్డి, ప్రజలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి కేంద్రంగా జిల్లా ఆవిర్భావమైన సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పుంగనూరు రోడ్డులోని మిషన్ కాంపౌండ్ నుంచి మొదలైన విజయోత్సవ ర్యాలీకి మదనపల్లె నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు, విద్యార్థులు, మహిళలు, యువత హాజరై పాలుపంచుకున్నారు. మిషన్ కాంపౌండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం మీదుగా వాల్మీకి సర్కిల్, టౌన్ బ్యాంక్ సర్కిల్, అవెన్యూ రోడ్డు, బెంగళూరు బస్టాండు, అనిబిసెంట్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ ముందుకు సాగింది. అనిబిసెంటుకు ఘన నివాళులు అర్పించారు. ఈ విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి విచ్చేసి ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కిషోర్ కుమార్‌రెడ్డి, షాజహాన్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని, దశాబ్దాల కల మదనపల్లె జిల్లా కలను నెరవేర్చడమే ఇందుకు నిదర్శనమన్నారు. చారిత్రాత్మక మదనపల్లె జిల్లా ఏర్పాటు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయ మన్నారు. మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గ వర్గాల ప్రజలకు ఒక పండుగ రోజన్నారు. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ మదనపల్లి జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని ప్రజల తరఫున ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పఠాన్ ఖాదర్‌ఖాన్, 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం రాయల్, విజయభారతి డాక్టర్ ఎన్.సేతు, ఆర్.జె.వెంకటేష్, నవీన్ చౌదరి, జంగాల వెంకటరమణ, రెడ్డి షంషేర్, పార్లమెంటు ఉపాధ్యక్షులు తలారి రాధమ్మ, మండిపల్లి మధుసూదన్ రెడ్డి, జెసిబి వేణు, బాలమాలి శేఖర్, ఎంఎంఎస్‌సి జాతీయ నాయకులు నరేంద్రబాబు పాల్గొన్నారు.

జిల్లాకు మదనపల్లె పేరే పెట్టాలి

తాళ్లపాక అన్నమాచార్యులు తెలుగు సాహితీ చరిత్రలో అత్యంత విశిష్టమైన స్థానాన్ని కలిగిన వాగ్గేయకారుడు, గొప్ప కవి అయితే మదనపల్లి ప్రాంతానికంటే తాళ్లపాక ప్రాంతంలో అయన పేరును ఇనుమడింప చేస్తే గొప్పగా ఉంటుందని ముస్లిం ఐక్యవేదిక అన్నమయ్య, కడప జిల్లాల అధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె ప్రజలు దశాబ్దాల కాలంగా మదనపల్లి జిల్లా కోసం పోరాటాలు చేసిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించి గౌరవించాలని కోరారు. మదనపల్లి ప్రజల ఆకాంక్షను, మనోభావాలను గౌరవించి మదనపల్లి పేరుతోనే మదనపల్లి జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు.జిల్లా కేంద్రంగా మదనపల్లెను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే అన్నమయ్య జిల్లా పేరునే కొనసాగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర?యం పట్ల ప్రజలు సంతృప్తిగా లేరని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించి మదనపల్లి జిల్లాగానే పేరును ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు సమీరుద్దీన్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

జిల్లా కోసం మంత్రి రాజీనామా చేయాలి

- మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

వైఎస్.జగన్ పాలనలో అభివృద్ధిపై అడుగులు వేసిన రాయచోటి ప్రాంతంపై సిఎం చంద్రబాబు కక్షగట్టారని మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రం రాయచోటిని రద్దుచేసి మదనపల్లెకు రతలించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం రద్దును నిరసిస్తూ బుధవారం వైసిపి ఆధ్వర్యంలో రాయచోటిలో నిర్వహించిన శాంతి యుత ర్యాలీకి ప్రజలు పెద్దఎత్తున తరలించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పుర వీధులలో నినాదాలను హోరెత్తించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసిపి శ్రేణులు ర్యాలీకి తరలివచ్చారు. పట్టణంలోని శివాలయం సర్కిల్ నుండి జాతీయ రహదారిలోని నేతాజీయ సర్కిల్ వరకు ర్యాలీ శాంతియుతంగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి ప్రాంతాభివృద్ధి కావాలన్న చిత్తశుద్ధి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఉంటే వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం డిమాండ్‌తో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తే రాబోయే ఎన్నికల్లో తాను ఆయనపై పోటీచేయబోనంటూ శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. జగనన్న రాయచోటికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్న రాజకీయ కక్ష్యతోనే కూటమి ప్రభుత్వ పెద్దలు రాయచోటిపై రాజకీయంగా కక్షగట్టారన్నారు. గత ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంగా రాయచోటే కొనసాగుతుందని చంద్రబాబు ఇచ్చిన హామీని అమలుపరచకపోవడం ద్వారా చరిత్రహీనుడయ్యాడన్నారు. జగన్ తీసుకువచ్చిన మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తున్న చంద్రబాబు రాయచోటికి మెడికల్ కళాశాలను ఇస్తామంటే ఎలానమ్మలో తెలియని పరిస్థితి ప్రజల్లో నెలకొందన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే అబద్దాలు చెబుతూ కాలం గడుపుతూ ప్రజలకు ఏరకంగా మేలుజరుగుతుందంటూ వారు ప్రశ్నించారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా తిరిగి ప్రకటించే వరకూ ప్రజలతో కలసి ఉద్యమిస్తూనే ఉంటామంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-సుండుపల్లె

మధ్యాహ్న భోజనం తిని మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం ఒక్కసారిగా విద్యార్థులకు అకస్మాత్తుగా విరేచనాలు, వాంతులు రావడంతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించగా, ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని సుండుపల్లి మండల విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ ఘటనకు కారణం మధ్యాహ్న భోజనమా లేక ఇతర ఏవైనా కారణాలున్నాయా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు భరోసా ఇచ్చారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాజంపేట

జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా రాజంపేటకు వచ్చిన కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ భావన పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశమై రెవెన్యూ, అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. ఇకపై కడప జిల్లాలో భాగంగా రాజంపేట డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ పాలన కొనసాగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం చేపట్టే అన్ని పరిపాలనా సంబంధ అంశాలను యధావిధిగా చేపట్టడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, భూ సమస్యలు, లీగల్ సంబంధిత అంశాలను, ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణలో మండల తహశీల్దార్లు పారదర్శకంగా, సమర్థవంతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏ ఒక్క గ్రామంలో కూడా పారిశుధ్యం, తాగునీటి సమస్యా తలెత్తకుండా చూడాలని ఎంపిడిఒలు, కమిషనర్లకు సూచించారు. కలెక్టర్‌ను మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

శ్రీసౌమ్యనాథస్వామి సన్నిధిలో కలెక్టర్

నందలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీసౌమ్య నాథస్వామిని కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ఆలయ చరిత్ర వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ భావన, తహశీల్దార్ అమరేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సేవలో కలెక్టర్ శ్రీధర్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: 2026 నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మదనపల్లి డిఎస్‌పి ఎస్.మహేంద్ర హెచ్చరించారు. బుధవారం మదనపల్లి పట్టణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా సిబ్బందితో కలిసి పెరేడ్ గ్రౌండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1న నూతన సంవత్సర వేడుకలలో నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆంధ్ర ఊటీ హార్శిలీహిల్స్‌లోనూ ఈ నిబంధనలు కఠినంగా అమలు చేశామని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సిజ్ చేయడంతో పాటు, సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. అలాగే మదనపల్లె డివిజన్ ప్రజలందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటనలో సిఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిబిఎన్ పల్లెలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రాజంపేట : ఊటుకూరు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం డిబిఎన్ పల్లెలో పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను జెసిబితో తొలగించి చెత్తను తొలగించి గ్రామం అంతా బ్లీచింగ్ చల్లారు. ఈ సందరరేగా పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వానలు, శీతాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు రోగాలు బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ అచ్యుత్ సాయి, సిబ్బంది వెంకటయ్య, హేమంత్ పాల్గొన్నారు.

ఎస్‌సి కమిషన్ మెంబర్‌కు సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబును దేవరాయి నల్ల గంగమ్మ దేవాలయం ఛైర్మన్ కునాసి సుబ్బరాజు యాదవ్ బుధవారం ఘనంగా సన్మానం చేశారు. అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాల పర్యటనలో భాగంగా శ్రీపతిబాబు సోమవారం సంబేపల్లె మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కునా సుబ్బరాజు ఇంటికి వెళ్ళిన ఆయనను ఘనంగా సన్మానించారు. గత ప్రభుత్వంలో ఎస్‌సిలకు జరిగిన అన్యాయాలు ఏమైనా ఉంటే కమిషన్ దృష్టికి తీసుకొని వెళ్లి వారికి న్యాయం జరిగే దిశగా తను ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వారితోపాటు రాజంపేట తెలుగు యువత కార్యదర్శి పోత్తూరు అశోక్ చౌదరి, మాజీ సర్పంచ్ గోపాల్, వెంకటయ్య, సంబేపల్లి టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఎస్‌సి కమిషన్ సభ్యులు శ్రీపతిబాబును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

క్రీడలు మనోధైర్యాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి-నందలూరు

క్రీడలు మనోధైర్యాన్ని, శారీరక ధృడత్వాని పెంపొందిస్తాయని విశ్రాంత రైల్వేస్టేషన్ మేనేజర్ ఆనంద్‌కుమార్, లోకో పైలట్ కమాల్‌బాషా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్‌ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి రవికుమార్, రైల్వే ఎలక్ట్రిక్ ఉద్యోగి రాజేష్, సీనియర్ క్రీడాకారులు బూదెల ప్రభాకర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, స్కౌట్ సభ్యులు పెంచలయ్య, అభిషేక్, హర్ష, అమృతరాజ్, రూపేష్; జయకుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్ ఎల్లయ్య

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని రెడ్డిపల్లె సర్పంచ్ ఎల్లయ్య అన్నారు. బుధవారం రెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో వీధిలైట్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో అవసరమైన చోట కొత్త ఎల్ఇడి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మత్తులతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీధి లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటంతో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి-రామాపురం

కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటుతున్న ఎన్నికల సమయంలో ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీ12వ పిఆర్‌సి కమిషన్ 30శాతం ఐఆర్ ప్రకటించాలని పిఎస్‌టియు రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ ముజురుల్ హుక్ డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పిహైస్కూల్(తెలుగు) (ఉర్దూ)పాఠశాల ఆవరణంలో బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వనజ రెడ్డి మహమ్మద్‌ఇలాల్‌తో కలిసి పిఎస్‌టియు డైరీ కేలండర్, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 12వ పిఆర్‌సి 30శాతం ఐఆర్ ఇస్తామని ప్రకటించిన హామీని అమలు పరచాలన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు ప్రభుత్వం అమలు దొరుకుతుందని ఎదురుచూస్తున్నారని త్వరగా అమలుపరిచి హామీని నిలుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెండు పాఠశాలల పిఇటిలు సతీష్‌రెడ్డి సన్నావుల్లా ఉపాధ్యాయులు శ్యాంసుందర్, గౌస్‌పీర్, మహబూబ్‌బాషా, యూనిస్‌పాల్గొన్నారు.

బండెన్న స్వామి ఆలయం, పీఠాధిపతి లక్ష్మీపతి స్వామి

నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైన బండెన్నస్వామి ఆలయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని బీరంగి పంచాయతీ శంకరాపురం వద్ద ఉన్న గూగుటి కోనలో వెలసిన బండెన్నస్వామి ఆలయం నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబు చేసినట్లు ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతిస్వామి వెల్లడించారు. ఈ వేడుకలకు మండలం నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా 221 దేవతామూర్తుల విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు కాంట్రాక్ట్ టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల నిరసన

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నిరసన చేపట్టనున్నట్లు ఆ యూనియన్ నాయకులు నజీర్ హుస్సేన్ తెలిపారు. ఆ మేరకు బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను కలిసి నోటీసు ఇచ్చారు. కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేకపోవడంతో, నిరసన చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీలు మణికిరణ్, దేవిక, శ్రావణి, అశ్వనితోపాటు పలువురు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తలను వేరుగా వేయాలి

ప్రజాశక్తి -చాపాడు (మైదుకూరు) : ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలను వేరుగా మైదుకూరు మున్సిపాలిటీ సిబ్బందికి అందజేయాలని వార్డు కౌన్సిలర్ ఎపి సుమలత సూచించారు. బుధవారం వార్డులోని ప్రజలకు ప్రభుత్వం తరుపున రెండు రకాల బుట్టలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తలకు రెండు రకాల బుట్టలు ఇచ్చారన్నారు. సిబ్బందికి వేరువేరుగా చెత్తను అందజేయడం వల్ల వారు సులభంగా వాటిని వేరు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యర్థ పదార్థాలను ఆరుబయట పడవేయకూడదన్నారు. వార్డు స్వచ్ఛతకు ప్రజల సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ నిరంజన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ వితరణ

తొండూరు : రేనాటి చంద్రుడు, అపర దానకర్ణుడు బుడ్డా వెంగల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా దీనబంధు వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి బుధవారం తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రానున్న పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ జనార్దన్‌రెడ్డి వంటి దాతలు పాఠశాల విద్యార్థులకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. భవిష్యత్తులో మరికొందరు దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి భూ రీసర్వే దోదపడుతుందని తహశీల్దార్ తపస్విని అన్నారు. బుధవారం ముష్టూరు గ్రామంలోని కొండయ్యగారిపల్లెలో ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ గోపీనాథ్, విఆర్ఒ శ్రీనివాసులు స్థానిక ప్రజాప్రతినిధులతో, కూటమి నాయకులతో కలసి గ్రామంలో త్వరలో చేపట్టనున్న భూ రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి, తప్పుల్లేని భూమి ధ్రువపత్రాలను తయారు చేయడానికి భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాదని అన్నారు. 2వ తేదీ నుంచి మండల పరిధిలోని రాచవేటివారిపల్లె, ముష్టూరు కొండయ్యగారిపల్లె గ్రామాలలో భూ రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు భూ రీసర్వే జరుగుతున్న సమయంలో తమ భూమి వద్ద అందుబాటులో ఉండాలన్నారు. రెవిన్యూ అధికారులు కూడా భూ రీసర్వే జరుగుతున్న గ్రామాలలోని ప్రజలకు, రైతులకు ముందుగానే రీసర్వేకు సంబంధించిన సమయాన్ని, సమాచారాన్ని వాట్సప్ ద్వారా తెలిపాలని సూచించారు. భూ రీసర్వేలో పాల్గొంటున్న రెవెన్యూ అధికారులకు తమ భూములకు సంబంధించిన ధ్రువపత్రాలను, ఇతర హక్కు పత్రాలను రైతులు, ప్రజలు చూపించి రీసర్వేను సక్రమంగా, వేగంగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి శశిధర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి వసంతా మునిరత్నం, కూటమి నాయకులు మురళీమోహన్, నాగరాజా, మాజీసర్పంచ్ రఫీ, విఆర్ఒ శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ మనోజ్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పేదల ఆకాంక్ష తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే


కలికిరిలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

పేదల ఆకాంక్ష తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణం బీడీ కాలనీలో ఉదయం ఆరు గంటల నుండి సంబంధిత అధికారులు సచివాలయ సిబ్బంది తోపాటు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. నూతన సంవత్సరానికి ఒకరోజు ముందే లబ్ధిదారులకు కానుకగా పింఛన్ అందించేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈరోజు సాయంత్రం లోగా లబ్ధిదారులకు పింఛను పంపిణీ పూర్తిచేయాలని అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీ పూర్తిగా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, కూటమి నాయకులు, అనుబంధ సంఘాలు, మహిళలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** సూపర్ సిక్స్ పథకాలతో ప్రతిఇంట సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం 14వార్డులో స్థానిక టిడిపి నాయకులు, ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్‌వలి ఆధ్వర్యంలో లబ్దిదారులకు పెన్షన్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఎమ్మెల్యే పెన్షన్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. నాగూర్ వలి మాట్లాడుతూ ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పెన్షన్ అందడంతో నూతన సంవత్సరం ఆనందం ఉప్పొంగిందన్నారు. మదనపల్లె జిల్లా ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మదనపల్లిలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

భూమి సారవంతాన్ని కాపాడుకోవాలి

భూమి సారవంతంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

భూమి సారవంతాన్ని మనమందరం కాపాడుకోవాలని రాయచోటి భూసార పరీక్షా కేంద్రం అధికారిని జి.సుధారాణి అన్నారు. బుధవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠశాల మట్టి ఆరోగ్యం కార్యక్రమంపై ఎఒ మంజుల, పాఠశాల ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శిరనితో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి ఆరోగ్యాన్ని మనమందరం కాపాడుకోవాలని అన్నారు. భూమి సారవంతంగా ఉన్నప్పుడే రైతులు పండించే పంటలు కూడా మంచి దిగుబడులను అందిస్తాయన్నారు. పంటలకు రసాయనక ఎరువులు అధికంగా వాడటం వలన భూమి సారవంతం కోల్పోయి భూమి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం వలన భూమి సారవంతం పెరిగి ఆరోగ్యంగా, బలంగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు అధిక దిగుబడులు వస్తాయన్నారు. భూమి కాలుష్యాన్ని నివారించాలని, రసాయనిక ఎరువులు వాడవద్దని, ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడవేయొద్దన్నారు. విద్యార్థులకు మట్టి నమూనాలను సేకరించే పద్ధతిని వివరించారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగానే రైతులు పొలాలకు ఎరువులు ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులు భూమి ప్రాముఖ్యతను తెలుసుకొని, భూమి సారవంతాన్ని కాపాడడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని మంజుల, పాఠశాల ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శిని, వ్యవసాయ సహాయకులు మధు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి హక్కులను పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-రామాపురం

గ్రామ ప్రజలకు పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

సమాజంలో ఎస్‌సి, ఎస్‌టి హక్కులను అధికారులు నాయకులు తమ పరిధిలో పరిరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తహశీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లిపంచాయతీ బీదవాళ్లపల్లి దళితవాడలో బుధవారం ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలను సమాజంలో తక్కువ చేసి చూస్తే కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు. భారతదేశానికి స్వాతంత్ర లభించి 70 సంవత్సరాలు దాటుతున్న గ్రామాలలో అక్కడక్కడ అంటరానితనం కనిపిస్తూనే ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం ఎస్‌సి, ఎస్‌టిలలో అవగాహన లోపించడమేనన్నారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థాయిలో ఉన్నప్పుడే ఎలాంటి అస్పృస్తులకు తావుండదన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్ సమాజంలోని అస్పృశ్యతను పోగొట్టడానికి రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రత్యేకమైన హక్కులను చట్టాలను రిజర్వేషన్లను రచించారని పేర్కొన్నారు. వాటిని అందిపుచ్చుకొని ఎస్‌సి, ఎస్‌టిలు ఎదగాలన్నారు. గ్రామాల్లో అగ్ర వర్ణాల నుంచి దౌర్జన్యాలు దాడులు లాంటివి జరిగినప్పుడు కాని ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడే తమ వంతు సమస్యలు పరిష్కారానికి సహాయ పడతామన్నారు. ఈ గ్రామంలో తాగునీరులో ఫ్లోరైడ్ శాతం ఎక్కువ ఉన్నదని శ్మశాన వాటిక సమస్య ఉందని గ్రామస్తులు సభ దృష్టి తెచ్చారన్నారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని ఆయన అన్నారు. సమావేశంలో ఎంఇఒక్మీ2 జైచంద్రుడు, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, విఆర్ఒ యగ్నేష్, టిడిపి నాయకులు భాస్కర్‌నాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ :'ముక్కా'

ప్రజల నుంచి వినతులతు స్వీకరిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాఘవ రాజుపురం టిడిపి కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యలను నేరుగా రూపానంద రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను నిర్లక్ష్యం చేయకుండా వారు సంతృప్తి చెందేలా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : రీ సర్వే జరిగిన గ్రామాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని ఆర్డీవో చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019-2024 మధ్య కాలంలో రాష్ట్రంలో నూతనంగా భూముల రీ-సర్వే జరిగిందన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలో ఈనెల 2నుంచి 9వ తేదీ వరకు కొత్తగా మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. పులివెందుల మండలంలో రాగిమానుపల్లె, రచ్చుమర్రిపల్లె, కనంపల్లె, లింగాల మండలంలోని హిరోజీపురం, నరసింగరావుపల్లె, రామ నూతులపల్లి, సింహాద్రిపురంలో దేవతాపురం, జంగంరెడ్డిపల్లె, తెలికి, హిమకుంట్ల, సింహాద్రిపురం, నిడివేల, తొండూరులో సైదాపురం, జాలపర్తి, వేములలో పెండ్లూరు, వేంపల్లెలో ముతుకూరు, చక్రాయపేటలో నర్సుపల్లి, గొట్లమిట్ట, కొండప్పగారిపల్లి, కుమారకాల్వ, మహాదేవపల్లి, అద్దాలమర్రి, ఆంజనేయపురం, వీరపునాయని పల్లిలో అయ్యవారిపల్లి, పిల్లివారిపల్లి, తలపనూరు, కీర్తిపల్లి, లింగాల, గోనమాకులపల్లి, తంగేడుపల్లి, అంకిరెడ్డిపల్లి, వెల్దుర్తి గ్రామాల్లో రీ-సర్వే పూర్తయినందున ఆయా గ్రామాల్లో పట్టా దారులకు భూముల సంబంధించి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు అవుతాయన్నారు. రైతులు పాత పట్టాదారు పుస్తకాలు తీసుకువచ్చి కొత్త పుస్తకాలు తీసుకోవాలని ఆర్డీఓ కోరారు. **చాపాడు :** జనవరి 2 నుంచి గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో సభను నిర్వహిస్తామన్నారు.

గుంటి ప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

మాజీ ఎమ్మెల్యే 'గుంటి'కి ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి-చిట్వేలి

మాజీ ఎమ్మెల్యే గుంటి వెంకటేశ్వరప్రసాద్ మృతి చాలా బాధాకరమని రైల్వేకోడూరు కూటమి ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ రూపా నందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, పలువురు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అనారోగ్యంతో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులు చిట్వేలిలో అంత్య క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో మొదట 1999లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలవుగా తిరిగి 2004లో ఎమ్మెల్యేగా గెలిచి మండలంలో పురాతనమైన ప్రభుత్వ భవనాలను నూతన భవనాలుగా నిర్మించి, చిట్వేలిలో రోడ్ల విస్తరించారని పేర్కొన్నారు. సౌమ్యుడిగా నియోజకవర్గంలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. వైసిపి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసరెడ్డి, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కోడూరు ఉప సర్పంచ్ శివసాయి, రమణారెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఉమామహేశ్వర్‌రెడ్డి

పబ్లిక్ మరుగుదొడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-చిట్వేలి

ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఉన్నటువంటి పంచాయతీ పబ్లిక్ మరుగుదొడ్లు గ్రామ ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోనే కాకుండా దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన మరమ్మతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎలాంటి రుసుం లేకుండా వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది కో-ఆప్షన్ సభ్యుడు అన్సర్‌బాష, కస్తూరి మని, హాజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలంలో పటిష్ఠ భద్రత

ప్రజాశక్తి-సుండుపల్లి : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మండలంలో పటిష్ఠ పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎస్‌కెం.హుస్సేన్ తెలిపారు. మండలంలో ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బలగాలతో పహారా ఏర్పాటు చేసినటుల తెలిపారు. వేడుకల పేరుతో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డీజేలు సౌండ్ సిస్టంలతో అల్లర్లు లేదా అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతియుతంగా సంబరాలు జరుపుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు

ప్రజాశక్తి - తొండూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ముందస్తు నూతన సంవత్సరాన్ని పిల్లలు సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ ఉపాధ్యాయురాలికి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు చిరునవ్వులు, ముద్దుముద్దు అభినందనలు అక్కడి వాతావరణాన్ని మరింత ఉల్లాసంగా మార్చాయి.

ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయండి : 'సిటు'

ప్రజాశక్తి- చిట్వేలి

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో నాలుగో తేదీ గొప్ప కార్మిక బహిరంగ సభలను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు అధ్యక్షులు జిల్లా సిహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి పంది కాళ్ళ మణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అఖిలభారత మహాసభల పోస్టర్లు కరపత్రాలు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రానంతరం కార్మిక వర్గం ఎన్నడూ ఎదుర్కొని తీవ్రమైన కష్టాలు నేడు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ముకాసి కార్మిక ఉద్యోగ ఉద్యమాలను అణిచివేస్తున్నాయన్నారు. కార్మికుల ఏ ఒక్క సమస్యను కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ధరల పెరుగుదల ఆకాశాన్ని అంటుతున్నాయని కానీ కార్మికుల జీతాలు పాతాళంలో ఉన్నాయన్నారు. మరోవైపు అదానీ అంబానీ కార్పొరేట్ల ఆస్తులు వందల రేట్లు అమాంతంగా పెరుగుతున్నా,అసమానతలు పేదరికం ఎన్నడూ లేని స్థాయిలో నేడు ఉందన్నారు. రూపాయి పతనం రోజురోజుకీ పెరుగుతుందన్నారు. విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలు కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతుందన్నారు. నాలుగు లేబర్ కోడులు రద్దు అయ్యే వరకు, కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వై సుజాత, ఆటో యూనియన్ నాయకులు, మల్లీ, సిద్దు, మనోహర్, బాబు, భాషా, దుర్గా, చిన్నా,వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

క్రైం కార్నర్

ట్రాన్స్‌ఫార్మర్ ట్రాక్టర్ బోల్తా

- జార్ఖండ్ యువకులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు కోసం సామగ్రిని తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరు జార్ఖండ్ యువకులు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన మదనపల్లిలో జరిగింది. మదనపల్లి ట్రాన్స్‌కో కార్యాలయంలో మొటుకు శివ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. ఇతని వద్ద వద్ద జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ముర్నే, సూలే పనిచేస్తున్నారు. మండలంలతోని బొమ్మనచెరువు గ్రామం, టేకుల పాళ్యం రోడ్డులో విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉండటంతో అందుకు కావాల్సిన సామగ్రి ట్రాక్టర్‌లో జార్ఖండ్ యువకులు తరలిస్తున్నారు. గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డులో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అందించి, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలుకా పోలీసులు విచారణ చేస్తున్నారు.